సాక్షి కరీంనగర్

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



ఎండ నుంచి రక్షణ పొందేందుకు తిప్పలు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు



కరీంనగర్ పూలే పార్కు వద్ద నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

ఫైర్‌డే

- ఉమ్మడి జిల్లాలో శుక్రవారం దంచికొట్టిన ఎండ
- జమ్మికుంట, మంథని, వెల్గటూర్‌లో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- 30 వరకు 46 డిగ్రీలు దాటనున్న ఎండవేడిమి
- ఉదయం 11 తర్వాత బయటకు వెళ్లొద్దని సూచన
- వడగాలుల తీవ్రతా ఎక్కువేనంటున్న నిపుణులు

కరీంనగర్‌టౌన్: ఉమ్మడి జిల్లా అగ్నిగుండంగా మారుతోంది. ఠారెత్తించే ఎండ.. తట్టుకోలేని వేడి.. భరించలేనంత ఉక్కపోత.. చెప్పలేనంత నీరసం.. వేసవి మొదలైన నుంచి వేడి గాలులు, ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటిపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్కెట్లు, రహదారులు కర్ఫ్యూను తలపిస్తున్నాయి. శుక్రవారం ఉమ్మడి జిల్లా పరిధిలోని జమ్మికుంట (కరీంనగర్)లో 45.6 డిగ్రీలు, మంథని (పెద్దపల్లి)లో 45.2, వెల్గటూరు(జగిత్యాల)లో 45.1 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నెల 30 వరకు 46 డిగ్రీలు దాటే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. మరో నాలుగు రోజులు ఎండలు మరింత మండుతాయని సూచించింది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలను రెడ్, ఆరెంజ్ జోన్‌లో చేర్చింది.

అప్రమత్తంగా ఉండాలి



ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతుండడం ప్రమాదమే. పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ తగిలితే చెమట పోసి ఒంట్లో ఉష్ణోగ్రతను నియంత్రించే ప్రక్రియ దెబ్బతింటుంది. నీరసం, నిస్సత్తువ తీవ్రమై ఒక్కోసారి ప్రాణాపాయానికి దారితీసే పరిస్థితులు ఎదురవుతాయి. ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం 6 గంటల తర్వాతే పనులు పూర్తి చేసుకోవాలి. అత్యవసరమైతే తగిన జాగ్రత్తలు తీసుకొని మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాలి. తగినంత నీరు తాగాలి.

– డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో, కరీంనగర్

న్యూస్‌రీల్

చక్రస్నానం.. పుష్పయాగం



చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

ఇల్లందకుంట(హుజూరాబాద్): అపరభద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారలకు చక్రస్నాన ఘట్టం, పుష్పయాగం(నాఖబలి) వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో కందుల సుధాకర్, కడారి కుమారస్వామి, సురేందర్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, మోహన్, రాజయ్య, రవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీలో నకిలీ ధ్రువపత్రాల నిందితులు



నిందితుల నుంచి వివరాలు సేకరిస్తున్న కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్

కరీంనగర్‌క్రైం: నకిలీ ధృవపత్రాలు సృష్టించి మోసం చేసిన కేసులో కరీంనగర్ జైలులో రిమాండ్‌లో ఉన్న మూల తిరుమలరెడ్డి, లంక శేఖర్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు కోర్టు అనుమతి ద్వారా ఒక రోజు కస్టడీకి తీసుకున్నారు. వారి నుంచి మరింత సమాచారం సేకరించేందుకు సీఐ ప్రదీప్‌కుమార్ శుక్రవారం వారి ఇళ్లలో సోదాలు జరిపి కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

ఎంపీగా 'బండి' చేసిన అభివృద్ధేమిటో చెప్పాలి



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: ఎంపీగా ఐదేళ్ల నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో బండి సంజయ్ చెప్పాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నగర కార్యాలయంలో మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడే అభివృద్ధి చేయని సంజయ్, వచ్చే ఐదేళ్ల అభివృద్ధి చేస్తామంటే ప్రజలెవరూ నమ్మరన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత ఐదు సంవత్సరాల పాటు ప్రజలకు కనిపించకుండా పోయిన సంజయ్ లోకలా, నాన్‌లోకలా తేల్చుకోవాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశాడని, గతంలో లోక్‌సభకు పోటీ చేశాడని గుర్తు చేశారు. సమావేశంలో ఎండీ తాజ్, శ్రవణ్‌నాయక్, దండి రవీందర్, బత్తిని చంద్రయ్య, ఎండీ చాంద్, షబానా మహమ్మద్, ఊరడి లత, దన్న సింగ్, కవిత, జ్యోతిరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ. 7,400

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో శుక్రవారం క్వింటాల్ పత్తికి రూ. 7,400 పలికింది. క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోత్ రెడ్డినాయక్ పర్యవేక్షించారు. మార్కెట్‌కు శని, ఆదివారం సెలవు ఉంటుందని కార్యదర్శి తెలిపారు. సోమవారం నుంచి తిరిగి క్రయవిక్రయాలు యథావిధిగా సాగుతాయని వివరించారు.

'అన్నా నామినేషనైతే వేశాం.. నియోజకవర్గమంతా తిరిగి ప్రచారం చేయడం మనవల్ల కాని పని.. ప్రధాన పార్టీ అభ్యర్థి ఎవరైనా నామినేషన్ విత్‌డ్రా చేసుకోమని మంచి ఆఫర్ ఇస్తే సిద్ధంగా ఉన్నాం..'

– కొందరు అభ్యర్థులు.. ప్రధాన పార్టీ అభ్యర్థులతో ఇలా మంతనాలు సాగిస్తున్నారు.

'అసలే ఎండలు దంచికొడుతున్నాయి.. దీనికితోడు ప్రచార ఖర్చు తడిసి మోపడవుతున్నది. కరీంనగర్ ఎంపీ స్థానానికి 94 నామినేషన్లు దాఖలు చేశారు. 20 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా.. 33 మంది పోటీలో ఉన్నారు. అయితే సాధ్యమైనంత మందిని విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నాలు చేద్దాం.'

– తమ ముఖ్య అనుచరులతో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రణాళికలు ఇవి.



తమ్మీ.. తప్పుకో..!

- కరీంనగర్ బరిలో 33 మంది అభ్యర్థులు
- కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో నామినేషన్ల పరిశీలన
- 15కు మించితే రెండు ఈవీఎంలు
- ఈవీఎంలు ఎక్కువైతే ఓటర్లు తికమకపడే అవకాశం
- నామినేషన్ల ఉపసంహరణకు నేతల మంతనాలు

కరీంనగర్: ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీల నేతలు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా ఏఒక్క చిన్నవిషయాన్నీ వదలకుండా వ్యూహాలు రచిస్తున్నారు. ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులకు మించితే రెండు ఈవీఎంలు ఉపయోగించాల్సి ఉంటుంది. కానీ... కరీంనగర్ ఎంపీ స్థానం నుంచి మొత్తం 53 మంది 94 నామినేషన్లు దాఖలు చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఘట్టం పూర్తయ్యింది. రిటర్నింగ్ అధికారులు శుక్రవారం నామినేషన్లు పరిశీలించారు. పార్లమెంట్ నియోజకవర్గంలో 20 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించినట్లు వివరించారు. 33 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. నామినేషన్ తిరస్కరణకు గురైన వివరాలను అభ్యర్థులకు అందిస్తామన్నారు.

రాయ'బేరాలు'...

అభ్యర్థులు అధిక సంఖ్యలో ఉండటంతో సుమారు 5 ఈవీఎంలను ఉపయోగించాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో పోలింగ్ రోజు ఓటర్లు తికమకపడే అవకాశం ఉంది. అలాగే అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు వివరించడంలో ఇబ్బందులుపడే అవకాశాలున్నాయి. దీంతో ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు ఉండేలా తెర వెనకాల ప్రయత్నాలు సాగిస్తున్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు, వారితో సన్నిహితంగా ఉండే వారితో రాయ'బేరాలు' కొనసాగిస్తున్నారు.

ఉపసంహరణకు యత్నాలు

- నామినేషన్ల ఉపసంహరణకు సోమవారంతో గడువు ముగియనుంది.
- ఈనేపథ్యంలో ఎన్నికల బరిలో నుంచి స్వతంత్రులుగా పోటీచేసిన అభ్యర్థులతో కొందరు మంతనాలు సాగిస్తున్నారు.

- ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక ఈవీఎంలో 16 గుర్తులు ఉండగా, అందులో చివరిది నోటాకు కేటాయిస్తారు.
- పోటీలో 15 మందికి మించితే రెండో ఈవీఎంనూ ఉపయోగించాల్సి ఉంటుంది.
- కరీంనగర్ ఎంపీ స్థానంలో 33 మంది బరిలో ఉన్నారు. వీరిలో కొందరికి వివిధ పార్టీల ముఖ్యనేతలు తాయిలాలు చూపి పోటీనుంచి తప్పుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి ప్రయత్నాలు ఏమేరకు ఫలించనున్నాయో సోమవారం తేలనుంది.

20 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణ

కరీంనగర్ లోక్‌సభ స్థానానికి దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తయ్యింది. కరీంనగర్ లోక్‌సభ స్థానానికి ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు 53 మంది 94 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నామినేషన్ పత్రాల పరిశీలన అనంతరం ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సక్రమంగా లేని 20 మంది అభ్యర్థుల నామిషన్లు తిరస్కరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. 33 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని వెల్లడించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

29 వరకు ఉపసంహరణ

నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత నుంచి ఎవరైనా అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరించుకునే అవకాశం ఉందని కలెక్టర్ పమేలా సత్పతి వెల్లడించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగిసిన తర్వాత ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం, ఆదివారం సెలవు ఉంటుందని తెలిపారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోగా నామి నేషన్లను అభ్యర్థులు ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరి పాటించాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమయం మించిన తర్వాత వచ్చి ఇబ్బందులు పడవద్దని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు కె.మహేశ్వర్, రమేశ్ బాబు, పలువురు అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

చిన్నారుల సంక్షేమానికి కృషి

కరీంనగర్‌రూరల్: అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను చిన్నారులు, తల్లులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి కోరారు. శుక్రవారం కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లోని అంగన్వాడీ కేంద్రం–2లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామ్, మామ్ పద్ధతుల ద్వారా చిన్నారుల పెరుగుదలతోపాటు తల్లుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులందరికీ తప్పనిసరిగా పోషకాహారం అందించాలని సూచించారు. కిశోర బాలికలకు ఏవైనా సమస్యలుంటే 181 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. సీడీపీవో లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ నిర్మల, డీసీపీవో శాంత, కోఆర్డినేటర్ లక్ష్మి, పీహెచ్ఎన్ విమల, డీపీఏ రోమిల, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సతీశ్, ఏఎస్ఎం రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి

గడీల వారసులు కావాలా.. గరీబోళ్ల బిడ్డ కావాలా?

- బీజేపీ కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్

మానకొండూర్/కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్, బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీలని బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన దళిత సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ సైతం దళితులను ముఖ్యమంత్రి చేస్తానని, మూడెకరాల భూమి ఇస్తానని మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఉద్యమంలో కనిపించని, ఎవరికి కోసం రాని కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు నేడు ఓట్ల కోసం వస్తున్నాడన్నారు. తనపై వందల కేసులున్నాయని, వారి వద్ద కోట్ల డబ్బులు ఉన్నాయని.. గడీల వారసులు కావాలో గరీబోళ్ల బిడ్డ కావాలో తేల్చుకోవాలన్నారు. తాను ప్రశ్నిస్తేనే ట్యాంకు బండ్‌పై అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఓట్లు వస్తున్నాయంటే అంబేద్కర్‌ను రాజకీయం కోసం వాడుకున్నారని మండి పడ్డారు. కేసీఆర్ దళితులకు ఇచ్చిన మాట తప్పితే ఏ దళిత సంఘాలు ప్రశ్నించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజుల గడిచినా ఎస్సీలకు ఏం ఇచ్చిందని ప్రశ్నించారు.

పార్టీల అభ్యర్థులను బేరీజు వేసి ఓటేయండి

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఆయా పార్టీల కార్యకర్తలే ఓటేసే పరిస్థితి లేదని బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎంపీ కార్యాలయంలో గన్నేరువరం మండలం జంగపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గీకురు లత, పలువురు యువకులు బీజేపీలో చేరగా, కాషాయ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండలానికి చెందిన యూత్ అసోసియేషన్ నాయకులు, కుమ్మరి సంఘానికి చెందిన 25 మంది, కురుమ సంఘానికి చెందిన 20 మంది నాయకులు, మానకొండురు నియోజకవర్గం అన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బండి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను బేరీజు వేసి ఓటేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, కార్యవర్గ సభ్యుడు కొప్పు బాష, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే శ్రీధర్, కుమ్మరి శంకర్, జాడి బాల్‌రెడ్డి, కొమ్మ జయశ్రీ, వేణుప్రసాద్, ఎస్.అజయ్‌వర్మ, లక్ష్మీనారాయణ, రాపాక ప్రవీణ్, గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, శ్రీహరి, కొంద్ర సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన ఆయా పార్టీల కార్యకర్తలు

ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రుణమాఫీ

- మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్/చిగురుమామిడి: 'ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేసి తీరుతాం, హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలి' అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. శుక్రవారం సైదాపూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుల శాపనార్థాలకు ప్రభుత్వం మారుతుందా? శాపనార్థాలు మానుకోవాలని హితవు పలికారు. పదేళ్లలో బీఆర్ఎస్ కూడా హామీలు నెరవేర్చలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 4 నెలలకే ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేసిందన్నారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడే జిల్లాలో ఆదర్శ, కస్తూరిబాగాంధీ పాఠశాలలు, గురుకులాలు, రోడ్లు నిర్మాణం చేయించానని గుర్తు చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేలుగా ఉండి జిల్లాకు పైసా పని చేయలేదన్నారు. కరీంనగర్ ఎంపీగా వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల మాట్లాడుతూ, తనను ఎంపీగా గెలిపిస్తే జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా సైదాపూర్ నుంచి బీఆర్ఎస్ నాయకులు భారీగా కాంగ్రెస్‌లో చేరగా, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ కండువా కప్పి ఆహ్వానించారు.

బీఆర్ఎస్, బీజేపీలకు ఓట్లడిగే హక్కులేదు

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు ఓట్లు అడిగే హక్కు లేదని, గ్రామాల్లో ఆ పార్టీ నేతలను ఎక్కడికక్కడే నిలదీయాలని మంత్రి ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి మేనల్లుడు, కొడుకు, కూతురు, సడ్డకుని కొడుకులు అంతా కలిసి రూ.7 లక్షల కోట్లు అప్పుచేసి వెళ్లిపోయారని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రవేశపెడితే బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఓర్వలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు మాట్లాడుతూ, బీజేపీ హటావో, దేశ్‌కీ బచావో నినాదంతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి రాఘవులు, అధికార ప్రతినిధి ఎం.రవీందర్, మంజులారెడ్డి, సుధాకర్, జి.శ్రీనివాస్, కె.తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ గీకురు రవీందర్, సీహెచ్.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



చిగురుమామిడిలో మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్, నమస్కరిస్తున్న ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు

కాంగ్రెస్, బీజేపీలకు ఓటేసే పరిస్థితి లేదు

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల బీఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్యే గంగుల, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ, కరీంనగర్‌లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటేసే పరిస్థితి లేదన్నారు. ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే, తాను, ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి నిధులు తీసుకొచ్చి కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ప్రతీ కార్యకర్త గ్రామాల్లో గడపగడపకూ వెళ్లి పదేళ్ల బీఆర్ఎస్ పాలన గురించి వివరించాలన్నారు. బీజేపీ దేవుని పేరు చెప్పి ఓట్లు దండుకునుడు తప్ప నియోజకవర్గంలో పావు కిలోమీటర్ రోడ్డు వేయలేదని ఎద్దేవా చేశారు. నాలుగు నెలల్లో కాంగ్రెస్ పరిస్థితి చూశామని, ఆచరణ సాధ్యం కానీ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని అన్నారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాక్‌లో పాల్గొని పలువురిని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో బీజేపీ మత రాజకీయాలు చేస్తూ ప్రజల మనోభావాలతో ఆడుకుంటుందని మండిపడ్డారు. దేవుని పేరు చెప్పి ఓట్లు దండుకునే బండి సంజయ్ వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న గుడికి ఒక్క పైసా అయినా తెచ్చాడా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవిందర్‌సింగ్, ఎంపీపీలు తిప్పర్తి లక్ష్మయ్య, పిల్లి శ్రీలత, తోట తిరుపతి, పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, కాసారపు శ్రీనివాస్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పక్కన ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

తీరుమారని 'స్మార్ట్' పనులు!

- మల్టీపర్పస్ పార్క్‌లోనూ అవే అక్రమాలు?
- స్థానిక కార్పొరేటర్ ఫిర్యాదుతో విచారణ
- ఆరోపణలపై దృష్టి పెట్టిన బల్దియా

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో చేపడుతున్న స్మార్ట్ సిటీ చివరి దశ పనుల్లోనూ తీరు మారడం లేదు. నగరం రూపు మార్చిన స్మార్ట్ సిటీ పనులపై గతంలోనే ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తడం తెలిసిందే. ఇందులో కొన్నింటిపై విచారణ కొనసాగుతోంది కూడా. అయినా విపరీతమైన జాప్యం నడుమ కొనసాగుతున్న మల్టీపర్పస్ పార్క్ పనుల్లో ఇప్పటికీ అవే నాసిరకం, నాణ్యతాలోపం చోటుచేసుకుంటున్నట్లు ఫిర్యాదులున్నాయి. తమకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల్లో పలుకుబడి ఉందనో, తమను ఎవరూ ఏమి చేయరనే ధీమానో తెలియదు కానీ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మల్టీపర్పస్ పార్క్ పనులపై స్థానిక కార్పొరేటర్ ఫిర్యాదు చేయగా, నగరపాలకసంస్థ ఈ పనులపై తాజాగా దృష్టి సారించింది.

నాణ్యతాలోపంపై ఫిర్యాదు

స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలోని మల్టీపర్పస్ హైస్కూల్ మైదానాన్ని పార్క్‌గా మార్చడం తెలిసిందే. పార్క్‌కు సంబంధించి సీసీ, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట వస్తువులు, గ్రీనరీ తదితర పనులు కొనసాగుతున్నాయి. నగరంలో స్మార్ట్ సిటీ పనులు 95 శాతం పూర్తి కాగా, ఈ పార్క్ పనులు మాత్రం ఐదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. పైగా పనుల్లో నాణ్యత పాటించడం లేదని, నాసిరకం మెటీరియల్ వాడుతున్నారనే అభియోగాలున్నాయి. భవన వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని లెవెలింగ్‌కు వాడుతుండడం, వాకింగ్ ట్రాక్ నాణ్యతపై ఇటీవల అధికారులు దృష్టి పెట్టడం తెలిసిందే. ఈ క్రమంలోనే స్థానిక కార్పొరేటర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పార్క్ పనుల్లో నాణ్యత లేదని, నాసిరకం మెటీరియల్ వాడుతున్నారని, అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ నగరపాలక కమిషనర్‌తో పాటు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నగరపాలక అధికారులు పార్క్ పనులపై దృష్టి సారించి అంతర్గతంగా విచారణ చేపట్టారు. అంచనాలు, టెండర్, పనులు జరుగుతున్న తీరు, ఫిర్యాదులోని అంశాలపై ఆరా తీస్తున్నారు. ఇదిలాఉంటే మల్టీపర్పస్ పార్క్ పనుల్లో స్మార్ట్ సిటీ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. పార్క్ పనులను నలుగురైదుగురు కాంట్రాక్టర్లు బిట్లవారీగా చేస్తున్నారు. ఏదైనా ఒక పనికి సంబంధించి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్, ఆ పనులను సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించే అవకాశం ఉంది. కానీ ఒక పనికి సంబంధించి బిట్‌ల వారీగా అంచనాలు రూపొందించి కాంట్రాక్టర్లకు అప్పగించడం మాత్రం నిబంధనలను ఉల్లంఘించడమేనంటున్నారు. మల్టీపర్పస్ పార్క్ పనులను బిట్లుగా అప్పగించి స్మార్ట్ సిటీ నిబంధనలను ఉల్లంఘించారంటూ కార్పొరేటర్ ఫిర్యాదు చేయడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్మార్ట్ పనుల్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తగా, కొత్త ప్రభుత్వంలో జరిగే పనుల్లోనూ అవే ఫిర్యాదులు కొనసాగుతుండడం విశేషం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పార్క్ పనులను గాడినపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అక్రమాలపై 29న విజిలెన్స్'..

కరీంనగర్ కార్పొరేషన్: స్మార్ట్ సిటీ పనులపై విజిలెన్స్ విచారణ మొదలైంది. నగరంలో చేపట్టిన స్మార్ట్ సిటీ పనుల్లో అక్రమాలు జరిగాయంటూ గతంలో ఫిర్యాదులు రావడం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, స్మార్ట్ సిటీ అక్రమాలపై కదలిక మొదలైంది. ఈ క్రమంలోనే నగరంలోని స్మార్ట్ సిటీ మిషన్ ప్యాకేజీ 3 కింద చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేపట్టింది. గతంలో చేపట్టిన క్షేత్రస్థాయి పరిశీలనలో పలు లోపాలు గుర్తించినట్లు విజిలెన్స్ పేర్కొంది. ఆ పనులు రికార్డు చేసిన అధికారులను విచారించేందుకు, ఈ నెల 29న తమ కార్యాలయంలో హాజరు కావాలని స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఎండీకి రీజినల్ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి ఎస్ఈలు ఎం.భద్రయ్య, పీవీ కృష్ణారావు, పి.నాగమల్లేశ్వర రావు, ఈఈలు పీవీ రామన్, డి.కిష్టప్ప, డీఈ టి.ఓంప్రకాశ్, ఏఈ పోసు వాణి 29న రేకుర్తిలోని రీజినల్ కార్యాలయంలో హాజరై వివరణ ఇవ్వాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.



మల్టీపర్పస్ పార్క్ ఇలా...

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): కేంద్ర ప్రభుత్వం ప్రకటించే సంత్ కబీర్, నేషనల్ హ్యాండ్ లూమ్ అవార్డు– 2023 కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు ఎస్.చరణ్ తెలిపారు. చేనేత రంగంలో విశిష్ట ప్రతిభ, డిజైన్‌లో నైపుణ్యం కనబరచిన, ఆ రంగంలో విశిష్ట సేవ చేసిన చేనేత కళాకారులకు ప్రతిష్టాత్మక సంత్ కబీర్, నేషనల్ హ్యాండ్ లూమ్ అవార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల వారు మే 25 లోపు www.handlooms.nic.in లో నిర్ణీత B1 ,B2 దరఖాస్తు ఫాంలు నింపి మూడు కాపీల దరఖాస్తు ఫాంలను weavers service centre, Hyderabad కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఒడిశా రాష్ట్రంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్, టెక్నాలజీ, బార్గా కళాశాలలో 3 సంవత్సరాల డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్, టెక్స్ టైల్ టెక్నాలజీ కోర్సుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు ఎస్.చరణ్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులు అయి 16 జూలై 2024 నాటికి జనరల్ కేటగిరీలో 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో 15 నుంచి 25 ఏళ్లు నిండినవారు అర్హులని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు 9 సీట్లు కేటాయించారని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు జూన్ 10 లోపు దరఖాస్తులను నిర్ణీత ఫార్మాట్‌లో నెల్లూరు జిల్లాలోని The principal spkm Indian institute of handloom technology venkatagiri, పిన్ కోడ్ 524132 అనే చిరునామాకు పంపాలని లేదా జిల్లా కేంద్రంలోని చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.iihtbargarh. org.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 1 నుంచి 6వ తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియం, 7 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 14 ఏళ్ల వయస్సు గల రాష్ట్రంలోని చెవిటి (బధిర) బాలబాలికలకు ప్రవేశము కల్పించబడునని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల వారికి ప్రవేశములో ప్రాధాన్యత ఇవ్వబడునని తెలిపారు. ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలు, స్కూలు యూనిఫాం, భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అడ్మిషన్ కావాలనుకునే వారు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, టీసీ, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దరఖాస్తులను మల్కాపూర్‌లోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు 90000 13639, 90002 21301, 96668 68755, 94914 76253 నంబర్లలో సంప్రదించాలన్నారు.

లంక శేఖర్‌పై రౌడీ షీట్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ విద్యారణ్యపురికి చెందిన లంక శేఖర్(52)పై శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఓపెన్ చేశామని సీఐ ఎ.ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వరుస నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగజేస్తూ ప్రజల శాంతికి భంగం కలిగించడమే కాకుండా.. బెదిరింపులకు గురిచేసి భూఆక్రమణలకు పాల్పడుతున్నాడని రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ప్రతిపాదన మేరకు కరీంనగర్ రూరల్ ఏసీపీ అనుమతించగా.. రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు చెప్పారు. ఈయన నాలుగు కేసు ల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడని తెలిపారు.

రెండు జిల్లాలు.. 22 మంది నేతలు

- మావోయిస్టుల లొంగుబాటే లక్ష్యం
- నక్సల్స్ నాయకులపై భారీ రివార్డులు
- సమాచారం ఇచ్చిన వారికి నజరానా
- ప్రకటించిన పోలీస్ అధికారులు
- రామగుండం కమిషనరేట్ పరిధిలో విస్తృత ప్రచారం


పెద్దపల్లి జిల్లాలోని మావోయిస్టుల పోస్టర్


మంచిర్యాల జిల్లాలోని మావోయిస్టుల పోస్టర్

గోదావరిఖని: మావోయిస్టులు పోరుబాట వీడి బ్యాలెట్ బాట పట్టాలనే లక్ష్యంతో రామగుండం పోలీసు యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. తొలిదశలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మావోయిస్టు అగ్రనేతల పేర్లు, ఫొటోలతో ముద్రించిన వాల్‌పోస్టర్లను గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని గోడలపై అంటిస్తున్నారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్‌లో 29మంది మావోయిస్టులు మృతి చెందారు. మరికొందరు తప్పించుకున్నారు. వారు మన రాష్ట్రంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. సరిహద్దు జిల్లాల్లో కూబింగ్ ముమ్మరం చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఒకవైపు వారిని కట్టడి చేస్తూనే మరోవైపు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసేలా పిలుపునిస్తోంది. చట్టసభలకు ఎన్నికై పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించాలని ఆహ్వానిస్తోంది. ఇంకోవైపు.. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని మావోయిస్టుల తలపై ఉన్న రివార్డుల వివరాలు వెల్లడించింది. ఈ రెండు జిల్లాల్లో అజ్ఞాతంలో 22మంది కీలక మావోయిస్టు నేతలు ఉన్నట్లు ప్రకటించింది.

పెద్దపల్లి జిల్లాలో కీలక నేతలు వీరే..

- పెద్దపల్లి జిల్లాకు చెందిన అజ్ఞాతంలో వివిధ స్థాయిల్లో ఉన్న కీలక మావోయిస్టు నేతలు, వారిపై ఉన్న రివార్డును పోలీసు యంత్రాంగం ప్రకటించింది.
- పెద్దపల్లికి చెందిన మల్లోజుల వేణుగోపాల్‌రావు ఉరఫ్ ప్రహల్లాద్ ఉరఫ్ వివేక్, భూపతి, సోను దాదా ఉరఫ్ అభయ్‌పై ప్రభుత్వం రూ.25లక్షల రివార్డు ప్రకటించింది.
- అదేవిధంగా మంథని మండలం శాస్త్రులపల్లెకు చెందిన మల్లా రాజిరెడ్డి ఉరఫ్ సత్తన్న, సాయన్న, మీసాల సత్తన్న, సాగర్, అలోక్, దేశ్‌పాండే, లక్ష్మణ్ ఉరఫ్ గోపన్నపై రూ.25లక్షల రివార్డు ఉంది.
- జూలపల్లి మండలం వడుకాపూర్ గ్రామానికి చెందిన పుల్లూరు ప్రసాదరావు ఉరఫ్ శంకరన్న, శంకర్‌రావు, చంద్రన్న ఉరఫ్ మల్కాపురం భాస్కర్‌పై రూ.25లక్షల బహుమతి ఉంది.
- పాలకుర్తి మండలం సబితం గ్రామానికి చెందిన గంకిడి సత్యనారాయణరెడ్డి ఉరఫ్ విజయ్‌పై రూ.20లక్షల రివార్డు ఉంది.
- కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన కంకణాల రాజిరెడ్డి ఉరఫ్ వెంకటేశ్‌పై రూ.20లక్షల రివార్డు ఉంది.
- పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఎగోలపు మల్లయ్యపై రూ.5లక్షల రివార్డు ప్రకటించారు.
- పెద్దపల్లి మండలంలో పాలితం గ్రామానికి చెందిన ఆలేటి రామలచ్చులుపై రూ.8లక్షల రివార్డు ఉంది.
- రామగుండం మండలం ఎఫ్‌సీఐకి చెందిన అప్పాసి నారాయణ ఉరఫ్ రమేశ్, ఉరఫ్ శంకర్‌పై రూ.5లక్షల రివార్డు ఉంది.
- పాలకుర్తి మండలం జయ్యారం గ్రామానికి చెందిన చీమల నర్సయ్య ఉరఫ్ పాశం నర్సయ్య, మోహన్, జోగన్నపై రూ.5లక్షల రివార్డు ఉంది.
- గోపయ్యపల్లెకు చెందిన దాతు ఐలయ్యపై రూ.5లక్షల రివార్డు
- జూలపల్లి మండలం వెంకట్రావ్‌పల్లి గ్రామానికి చెందిన డీకొండ శంకయ్య ఉరఫ్ శేషన్నపై రూ.5లక్షల రివార్డు
- సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామానికి చెందిన జువ్వాడి వెంకటేశ్వర్‌రావు ఉరఫ్ ధర్మన్నపై రూ.4లక్షల రివార్డు ప్రకటించారు.

మంచిర్యాల జిల్లాలోని మావోయిస్టులు వీరే..

- మంచిర్యాల జిల్లాకు చెందిన 10మంది కీలక మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో..
- మందమర్రి ఒకటో జోన్‌కు చెందిన బండి ప్రకాశ్ ఉరఫ్ బీపీ, ప్రభాకర్, క్రాంతి, బండి దాదాపై రూ.20లక్షలు రివార్డు ప్రకటించారు.
- తాండ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన బడే చొక్కారావు ఉరఫ్ దామోదర్‌పై రూ.20లక్షల రివార్డు ఉంది.
- బోథ్ మండలం పోచర గ్రామానికి చెందిన మైలారపు అడెల్లు ఉరఫ్ భాస్కర్‌పై రూ.20లక్షల రివార్డు
- బెల్లంపల్లి మండలం కన్నాలబస్తీకి చెందిన సలకల సరోజ ఉరఫ్ లతపై రూ.20లక్షల రివార్డు ప్రకటించారు.
- బెల్లంపల్లి మండలం కన్నాలబస్తీకి చెందిన కాసరబోయిన రవి, ఉరఫ్ విజయ్, అశోక్‌పై రూ.5లక్షల రివార్డు ఉంది.
- కోటపల్లి మండలం పారుపల్లి గ్రామానికి చెందిన ఆత్రం లచ్చన్న ఉరఫ్ గోపన్న, రాజప్ప, గంగన్న, భీమన్నపై రూ.5లక్షల రివార్డు ఉంది.
- బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన జాడి వెంకటి ఉరఫ్ సురేశ్, మంగన్నపై రూ.5లక్షల రివార్డు
- బెల్లంపల్లి మండలం శాంతిఖనికి బస్తీకి చెందిన ఆరెపల్లి కృష్ణ ఉరఫ్ కిష్టుపై రూ.5లక్షల రివార్డు ఉంది.
- బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన జాడి పుష్ప ఉరఫ్ అవుల బాలమ్మ, రాజేశ్వరి, రాజేశ్వరక్కపై రూ.5లక్షల రివార్డు ప్రకటించారు.
- మందమర్రికి చెందిన బబ్బెర రవి ఉరఫ్ రవిపై రూ.లక్షల రివార్డును ప్రకటించారు.

తుపాకీ వీడండి



మావోయిస్టులు తుపాకీ బాట వీడి బ్యాలెట్ బాట పట్టాలి. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికై పోలీసు నుంచి గౌరవ వందం స్వీకరించాలి. అడవుల బాటపట్టి ఇన్నాళ్లు సాధించిందేమీ లేదు. లొంగిపోయిన మావోయిస్టులపై ఉన్న రివార్డులను వారికే అందజేస్తాం.
– శ్రీనివాస్, పోలీసు కమిషనర్, రామగుండం

ఆపరేషన్ లేకుండా గుండెకు అరుదైన చికిత్స

- సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యుల ఘనత


మాట్లాడుతున్న డాక్టర్ ప్రమోద్‌కుమార్

కరీంనగర్‌టౌన్: హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో అత్యంత అరుదైన గుండె శస్త్ర చికిత్స చేసి ఓ మహిళకు కొత్త జీవితాన్ని అందించినట్లు సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లోని యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గోదావరిఖనికి చెందిన నరెడ్ల సుజాత ఏడాదిగా దగ్గుతో ఇబ్బందులు పడుతున్న క్రమంలో 8 నెలల క్రితం తమ ఆస్పత్రికి వచ్చిందని, ఆమెకు పరీక్షలు నిర్వహించగా గుండెకు సంబంధించిన అయోటా పైప్ ఉబ్బినట్లు గుర్తించామని పేర్కొన్నారు. సాధారణంగా ఓపెన్ హార్ట్ సర్జరీ ద్వారా దీన్ని సరిచేయాలని, కానీ ఆ పద్ధతిలో రిస్క్ ఎక్కువ ఉన్నందున ఆమెకు తొడ నరము నుంచి అయోటిక్ స్టంట్ వేసి కాపాడినట్లు తెలిపారు. ఆపరేషన్ లేకుండా గుండె వాల్వులను కూడా రిప్లేస్మెంట్ చేస్తున్నామని వివరించారు. ఇటీవల కార్డియాక్ అరెస్టుల సంఖ్య పెరుగుతుందని, దీనికి దీర్ఘకాలిక వ్యాధులతో పాటు, ధూమపానం, మద్యపానం ఆరోగ్యకరమైన జీవన శైలి లేకపోవడమని పేర్కొన్నారు. తాము అందించిన చికిత్స ద్వారా సుజాత పూర్తిగా కోలుకొని, 8 నెలలుగా ఆరోగ్యంగా జీవిస్తోందన్నారు. అనంతరం సుజాత మాట్లాడుతూ, తాను బతుకుతానని అనుకోలేదని, యశోద ఆస్పత్రి వైద్యులు అందించిన అధునాతన వైద్యంతో ఇప్పుడు సాధారణ జీవితాన్ని గడపడం సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు ఏ ఆసుపత్రికి వెళ్లినా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని, రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు ఖర్చు అవుతాయని చెప్పారని పేర్కొన్నారు. యశోద ఆసుపత్రిలో ఆపరేషన్ లేకుండా, ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్కువ ఖర్చులో చేశారని, పునర్జన్మను అందించిన డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

కరీంనగర్‌క్రైం: మద్యానికి బానిసైన భర్త తన భార్యను రోకలి బండతో కొట్టి చంపిన కేసులో భర్తకు జీవిత ఖైదుతోపాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా భీముని మండలం వాడ్ల గ్రామానికి చెందిన డోకా బక్కయ్య కూతురు వసంతను మహారాష్ట్రకు చెందిన వ్యక్తి వివాహం చేసుకున్నాడు. తర్వాత బక్కయ్య ఇంటి ముందు గల మహమ్మద్ సాబీర్(30) వసంతతో ఉన్న పరిచయంతో ఆమెకు మాయమాటలు చెప్పి తీసుకొని వెళ్లి వివాహం చేసుకున్నాడు. ఈ సంఘటన తర్వాత బక్కయ్య తన కుటుంబంతో సహా బతుకుదెరువు కోసం చొప్పదండి మండలం మంగళపల్లికి వచ్చి జీవిస్తున్నాడు. వసంతకు కూడా ఆర్థిక ఇబ్బందులు రావడంతో కుటుంబంతో సహా తండ్రి వద్దకు వచ్చి వారితో కలిసి జీవిస్తోంది. వసంత భర్త సాబీర్ తాగుడుకు బానిసై 2017 అక్టోబర్ 13న రాత్రి తాగి వచ్చి భార్యతో గొడవ పడి ఆమెను రోకలి బండతో తీవ్రంగా గాయపరచడంతో.. ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. బక్కయ్య చొప్పదండి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సాబీర్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ లక్ష్మీబాబు ఈ కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టి వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు సాబీర్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


గంగాధర్(ఫైల్)

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లులకు చెందిన ముదాం గంగాధర్ (38) శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లికి వెళ్తుండగా వీఆర్‌ఎం గార్డెన్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. గంగాధర్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గంగాధర్ కోరుట్ల వెటర్నరీ ఆస్పత్రిలో అటెండర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని జగిత్యాల యువకుడు..

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై గురువారం అర్ధరాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. జగిత్యాలలోని హన్మాన్‌వాడకు చెందిన పాదం వంశీకృష్ణ (28) గురువారం రాత్రి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో సారంగాపూర్ మండలం రంగపేటకు చెందిన గాలిపల్లి నవీన్ తన ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా నడిపి వంశీకృష్ణ వాహనాన్ని ఢీకొట్టాడు. వంశీకృష్ణ బలంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై నరేశ్ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జగిత్యాల క్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో గురువారం రాత్రి పోగుల అశోక్ (40) అనే వ్యక్తి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సారంగాపూర్ మండలం ఒడ్డెరకాలనీకి చెందిన పోగుల అశోక్ మల్యాల మండలం రాజారంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. సాయంత్రం ద్విచక్ర వాహనంపై ధరూర్ గొల్లపల్లి బైపాస్ రోడ్డు మీదుగా జగిత్యాల వస్తుండగా మోతె శివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచనలతో కరీంనగర్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఫోర్జరీ కేసులో ధరణి మాజీ ఆపరేటర్ అరెస్ట్

వీణవంక(హుజూరాబాద్): కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ భూమి విషయంలో ఫోర్జరీకి పాల్పడిన ధరణి మాజీ ఆపరేటర్ అరుణ్‌చౌదరితో పాటు మరొకరిని అరెస్ట్ శుక్రవారం చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. దూలం రాజయ్యకు 2.26 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డికి 1.13 ఎకరాలు, కొలిపాక రామస్వామికి 1.13 ఎకరాలు గతంలో అమ్ముకున్నాడు. ఇది నచ్చని రాజయ్య మేనల్లుడు బొంగోని స్వామి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ధరణి మాజీ ఆపరేటర్ అరుణ్‌చౌదరితో ఒప్పందం చేసుకొని రాజయ్య అమ్మినభూమిని కాజేయాలనుకున్నారు. డీటీ, ధరణి మాజీ ఆపరేటర్‌కు రూ.2 లక్షలు తీసుకొని తప్పుడు డాక్యుమెంట్లతో బొంగోని స్వామి పేరుమీద భూమి రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయమై మోహన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): నర్సయ్యపల్లి గ్రామ శివారులోని నేహా కాన్సెప్ట్ స్కూల్ సమీప రాజీవ్ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల జిల్లా రాంనగర్‌కు చెందిన తొటం రాములు(69) అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి మృతి చెందారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. రాములు తన చిన్నకూతురు కవిత, అల్లుడు ఎలిగేటి తిరుపతి, మనవళ్లు అశ్విత్, విదున్‌తో కలిసి కారులో మంచిర్యాల నుంచి హైదారాబాద్ వెళ్తున్నాడు. ఈక్రమంలో కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేయడంతో వెనకాల వెళ్తున్న కారు ఢీకొట్టింది. కారులోని రాములుకు తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తీసుకెళ్లాడరు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి అల్లుడు, కూతురు, మనవళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి భార్య కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

పకడ్బందీగా సెకండ్ ర్యాండమైజేషన్



కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ పకడ్బందీగా నిర్వహించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సెకండ్ రాండమైజేషన్‌ను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహించారు. ఈ ప్రక్రియను కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలింగ్ సిబ్బందిని సెకండ్ రాండమైజేషన్ ద్వారా అలాట్ చేశామని పేర్కొన్నారు. వీరికి త్వరలో ఎన్నికల విధులపై శిక్షణ నిర్వహిస్తామని వివరించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని, అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, కరీంనగర్, సిరిసిల్ల అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, పూజారి గౌతమి, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్‌వో పవన్‌కుమార్, సీపీవో కొమురయ్య, డీఐవో శివరాములు, అధికారులు పాల్గొన్నారు.

ఈత నేర్పమంటివి కదా కొడుకా..

- కనిపించకుండా పోతివి కొడుకా..
- తడగొండలో ఈతకు వెళ్లి బాలుడి మృతి


మణితేజ (ఫైల్)


విలపిస్తున్న తల్లి

బోయినపల్లి(చొప్పదండి): 'సెలవులచ్చినయి దోస్తులు ఈత నేర్చుకుంటుండ్రు.. ఈత నేర్పమంటివి కదా కొడుకా.. కనిపించకుండా పోతివా కొడుకా..' అని ఆ తల్లి రోదన అక్కడి వారి హృదయాలను కలచివేసింది. ఈత నేర్చుకునేందుకు వెళ్లిన ఏడో తరగతి విద్యార్థి చేపూరి మణితేజ(12) బావిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం తడగొండకు చెందిన చేపూరి తిరుమల–గంగయ్యలకు మణితేజ, రిత్విక్ కొడుకులు. పాఠశాలకు వేసవి సెలవులు రావడంతో ఈత నేర్చుకునేందుకు తండ్రి గంగయ్య, తాత రామయ్యలతో కలిసి గత మూడు రోజులుగా మణితేజ వెళ్తున్నాడు. గ్రామంలోని తాటివనం పరిసరాల్లోని వందురునూతిలో ఓ రోజు తాత, మరో రోజు తండ్రి ఈత నేర్పుతున్నారు. మణితేజ తాత రామయ్య శుక్రవారం గంగాధర మండలం చర్లపల్లికి వెళ్లగా.. తండ్రి గంగయ్యతో కలిసి ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. అదే బావిలో మరికొందరు సైతం ఈత కొడుతున్నారు. ఈక్రమంలో ఈత కొడుతుండగా మణితేజ మునిగిపోయాడు. పదిగజాల లోతులో నీళ్లు ఉండడంతో ఎంత వెదికినా బాలుడి ఆచూకీ లభించలేదు. మోటార్లు పెట్టి నీరు తీసే ప్రయత్నం చేసినా ఖాళీ కాలేదు. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ రెస్క్యూ టీమ్‌కు సమాచారం ఇవ్వగా.. గజ ఈతగాళ్లు వచ్చి తెప్ప సాయంతో మణితేజ మృతదేహాన్ని బయటకు తెచ్చారు. బావిలో మణితేజ గల్లంతయ్యాడని తెలియడంతో గ్రామస్తులందరూ అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయగానే తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డు పంచాయతీ కార్యదర్శి మృతి


సాయిలు(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్, సిద్దిపేట ప్రధాన రహదారిపై కారు, స్కూటీ ఢీకొన్న సంఘటనలో రిటైర్డు పంచాయతీ కార్యదర్శి దుర్మరణం చెందారు. ఏఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాలు. ముస్తాబాద్‌కు చెందిన రిటైర్డు పంచాయతీ కార్యదర్శి అబ్రమేని సాయిలు(66) శుక్రవారం స్కూటీపై పొలం పనులకు వెళ్తుండగా.. సిద్దిపేట వైపు నుంచి వస్తున్న కారు వేగంగా స్కూటీని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ సాయిలును సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఉదయం ఇంటి వద్ద టిఫిన్ చేసి వెళ్లిన సాయిలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడనే విషయం తెలుసుకున్న భార్య పరమేశ్వరీ, కూతుళ్ల వెన్నెల, అర్చనల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటరమణ తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు తప్పిన ప్రమాదం

సిరిసిల్ల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆవునూర్‌కు చెందిన విజయభాస్కర్‌రెడ్డి కుటుంబీకులతో కారులో సిద్దిపేట నుంచి ఆవునూర్‌కు వస్తున్నారు. వీరి కారు హన్మాన్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు వైపు వస్తుండగా సాయిలు స్కూటీని ఢీకొట్టింది. కారు వేగంగా ఉండడంతో రోడ్డు కిందికి వెళ్లింది. అక్కడ పెద్ద బండరాయి ఉండడంతో కారు బోల్తా పడలేదు. కారులో ఉన్న విజయభాస్కర్ రెడ్డికి స్వల్పంగా గాయాలయ్యాయి. కారులో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు.

శ్రీలంక అమ్మాయి.. మేడిపల్లి అబ్బాయి


వివాహం చేసుకుంటున్న జంట

రాయికల్: ఉద్యోగం కోసం జోర్డాన్ దేశం వెళ్లిన మేడిపల్లి అబ్బాయి.. శ్రీలంక అమ్మాయి మధ్య ప్రేమ చిగురించింది. వీరి ప్రేమకు కుటుంబసభ్యులు అంగీకారం తెలపడంతో హిందూసాంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. మెట్‌పల్లి మండలం మూడుబొమ్మల మేడిపల్లి గ్రామానికి చెందిన జొరిగె అశోక్ ఉద్యోగం కోసం జోర్డాన్ దేశానికి వెళ్లాడు. అక్కడ శ్రీలంక దేశానికి చెందిన సమన్వి పరిచయమైంది. ఇరువురి మధ్య ప్రేమ చిగురించింది. వీరి ప్రేమకు కుటుంబసభ్యులు అంగీకారం తెలపడంతో అశోక్ అక్కాబావలైన రాయికల్ మండలం రామాజీపేటకు చెందిన చేగంటి శేఖర్–పూజితలు హిందూ సాంప్రదాయ ప్రకారం భూపతిపూర్‌లోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వీరి వివాహం జరిపారు. దంపతులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ సర్పంచులు వాసరి రవి, మాజీ ఎంపీటీసీ బెజ్జంకి మోహన్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు ఆశీర్వదించారు.

ఎడ్‌టాక్స్‌లో పారమిత విద్యార్థుల ప్రదర్శన


ఎడ్‌టాక్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్: అంతర్జాతీయ స్థాయిలో అమెరికా వారు నిర్వహించే ప్రతిష్టాత్మకమైన ఎడ్‌టాక్స్ కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని స్థానిక కరీంనగర్ మైత్రి కన్వెన్షన్ వేదికగా పారమిత ఎడ్‌టాక్స్ కార్యక్రమంలో పారమిత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఐదో తరగతికి చెందిన పెంచాల మాన్వి లైఫ్ స్కిల్స్ అనే అంశంపై, రసపల్లి హదస్సది త్రియూనిక్‌నెస్ అనే అంశంపై, ఆరో తరగతికి చెందిన సిమ్రా ఆఫ్ షీన్ ఇంపాక్ట్ ఆఫ్ సోషియల్ మీడియా ఆన్ హ్యూమన్ బీయింగ్స్ అనే అంశంపై, ఏడో తరగతికి చెందిన సయ్యద్ జక్వాన్ హుస్సేన్ ప్లాట్యుస్ ఆఫ్ లాటెంట్ పొటెన్షియల్ అనే అంశంపై, తోట హర్షిత్ ఏషియాంట్ ఇండియా ఆజ్ మోడ్రెన్ ఇండియా అనే అంశంపై, చీరాల లాలిత్య కృష్ణ ప్రణవి పర్సనల్ ఐడెంటిటీ అనే అంశంపై తమ అద్భుతమైన ప్రసంగాలతో శ్రోతల్లో ఆలోచనా దృక్పథాన్ని పెంచారు. పారమిత పాఠశాలల అధినేత ప్రసాద్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, కిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్, విట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళి, రామచందర్‌రావు, నిఖిల్, జ్యోతి, రవీంద్రచారి, అనంతచారి, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వినోదరావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వి.యు.ఎం. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్, రితేష్ మెహత, శ్రీకర్, శర్మిష్ఠ, ప్రోగ్రామ్ హెడ్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఇంటర్‌లో సత్తా చాటిన 'తేజస్' విద్యార్థులు


విజయ సంకేతం చూపుతున్న తేజస్ చైర్మన్ సతీష్‌రావు, విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని తేజస్ జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో సత్తా చాటారు. కొత్తపల్లిలోని తేజస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను తేజస్ జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ కరస్పాండెంట్ సీహెచ్ సతీష్‌రావు బొకెలతో అభినందిస్తూ సన్మానించారు. ఎంపీసీ ఫస్టియర్‌లో 470కు గాను కనకట్ల మారుతి, మెర్రి రాజేశ్ 466 మార్కులు, ముక్కెర దేవేందర్ 465, ముదిగొండ మల్లికార్జున్ 464, అరుకొండ సంజయ్ 461, మంగళారపు సాయిప్రణయ్ 460, ఆర్.తరుణ్ 438 మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. బైపీసీలో 440 మార్కులకు గాను మంతెన సన్నీ 435, గుగులోతు రాజశేఖర్ 431 మార్కులు, సీఈసీ ఫస్టియర్‌లో ముక్కెర మనోజ్‌కుమార్ 469 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఇంటర్ సెకండియర్‌లో 1000 మార్కులకు గాను తాపళ్ల గణేశ్ 983, ఉత్కం హర్షిత్ 981 మార్కులు, సీఈసీలో కాలువ అభిషేక్ 902 మార్కులతో రాణించారని పేర్కొన్నారు.


ప్రతీకాత్మక చిత్రం

పరంపర

సెలవులొచ్చేశాయ్ ఫోన్ పక్కన పడేద్దామా

సెలవులొచ్చేది ఆటల కోసం, స్నేహాల కోసం బంధువుల కోసం, విహారాల కోసం, వినోదాల కోసం పిల్లలు ఇంతకాలం ఫోన్లలో కూరుకుపోయారు. వారిని ఫోన్ల నుంచి బయటకు తెండి. మీ బాల్యంలో సెలవుల్లో ఎలా గడిపారో అలా గడిపేలా చేయండి. పెద్దయ్యాక తలుచుకోవడానికి బాల్యం లేకపోవడానికి మించిన విషాదం లేదు.

ఆటస్థలాలు లేని స్కూళ్లలో చదివించడం, ఆడుకునే వీలు లేని ఇళ్లలో నివసించడం, పార్కులు లేకపోవడం, ఆడుకోవడానికి తోటి పిల్లలు లేని వాతావరణంలో జీవించడం, ఇవన్నీ ఉన్నా పిల్లలతో గడిపే సమయం తల్లిదండ్రులకు లేకపోవడం... వీటన్నింటి వల్ల పిల్లలకు స్కూల్, ఇల్లు కాకుండా తెలిసింది ఒకే ఒక్కటి. సెల్‌ఫోన్. పిల్లలకు సెల్‌ఫోన్లు ఇచ్చి వారు వాటిలో కూరుకుపోతే 'అమ్మయ్య. మా జోలికి రావడం లేదు' అనుకునే తల్లిదండ్రులు ఉన్న ఈ కాలంలో పిల్లలకు ఆరోగ్యకరమైన ఆటలు, విహారం, అనుబంధాల విలువ, కొత్త విషయాల ఎరుక ఎలా కలుగుతుంది?

అందుకే వేసవి సెలవులు ఒక పెద్ద అవకాశం. ఇరవై ముప్పై ఏళ్ల క్రితం వరకు తెలుగు ప్రాంతాలలో వేసవి సెలవులు వస్తే పిల్లలు ఎలా గడిపేవారో ఇప్పుడూ అలా గడిపే అవకాశం కల్పించవచ్చు. కాకుంటే తల్లిదండ్రులు ప్రయత్నించాలి. పిల్లలను మోటివేట్ చేయాలి.

బంధువులు- బంధాలు

బంధువులు ఎవరో తెలియకపోతే బంధాలు నిలవవు. ఎంత స్వతంత్రంగా జీవిద్దామనుకున్నా, సాటి మనుషుల విసిగింపును తప్పించుకుని తెగదెంపులు చేసుకుని బతుకుదామనుకున్నా మనిషి సంఘజీవి. అతడు బంధాలలో ఉండాల్సిందే. బంధాల వల్ల బతకాల్సిందే. పిల్లలకు బంధాలు బలపడేది, బంధాలు తెలిసేది వేసవి సెలవుల్లోనే. ఇంతకు ముందు పిల్లలు వేసవి వస్తే తల్లిదండ్రులను వదిలిపెట్టి పిన్ని, బాబాయ్, పెదనాన్న, తాతయ్య... వీళ్ల ఇళ్లకు వెళ్లి రోజుల తరబడి ఉండేవారు. వారి పిల్లలతో బంధాలు ఏర్పరుచుకునేవారు. దీని వల్ల కొత్త ఊరు తెలిసేది. ఆటలు తెలిసేవి. కలిసి వెళ్లిన సినిమా అలా ఓ జ్ఞాపకంగా మిగిలేది. ఇవాళ పెద్దల పట్టింపులు పిల్లలకు శాపాలవుతున్నాయి. రాకపోకలు లేని బంధుత్వాలతో పిల్లలు ఎక్కడకూ వెళ్లలేని స్థితి దాపురించింది. దీనిని సరి చేయాల్సిన బాధ్యత పెద్దలదే. లేకుంటే పిల్లలు ఫోన్లనే బంధువులుగా భావించి అందులోని చెత్తను నెత్తికెక్కించుకుంటారు. జీవితంలో సవాళ్లు ఎదురైన సమయంలో ఒంటరితనం ఫీలయ్యి అతలాకుతలం అవుతారు.

తెలుగు ఆటలు

సెలవుల్లో పిల్లలకు తెలుగు ఆటలు తెలియడం ఒక పరంపర. బొంగరాలు, గోలీలు,



వామనగుంటలు, పరమపదసోపాన పటం, ఒంగుళ్లు-దూకుళ్లు, నేల-బండ, ఏడుపెంకులాట, పులి-మేక, నాలుగు స్తంభాలాట, వీరి వీరి గుమ్మడిపండు, లండన్ ఆట, రైలు ఆట, పొడుపుకథలు విప్పే ఆట, అంత్యాక్షరి, కళ్లకు గంతలు... ఈ ఆటల్లో మజా తెలిస్తే పిల్లలు ఫోన్ ముట్టుకుంటారా?

కథ చెప్పకుందామా

కథలంటే పిల్లలకు ఇష్టం. పెద్దలు చెప్పాలి గాని. ఈ సెలవుల్లో రాత్రి పూట భోజనాల య్యాక, మామిడి పండ్లు తిన్నాక, పక్కలు వేసుకుని అందరిని కూచోబెట్టి పెద్దలు కథలు చెప్తే ఎన్నెన్ని తెలుస్తాయి! ఎన్ని ఊహల కవాటాలు తెరుచుకుంటాయి. మర్యాద రామన్న, తెనాలి రాముడు, బేతాళుడు, సింద్‌బాద్, ఆలీబాబా, పంచతంత్రం, రామాయణం, మహాభారతం... భీముడిలోని బలం, అర్జునుడిలోని నైపుణ్యం... ఇవి కదా చెప్పాలి.

బలం కోసం తిండి:

పిల్లలను సరిగ్గా గమనించి వారికి కావలసిన బలమైన తిండి తినిపించడానికి వీలయ్యేది ఈ సెలవుల్లోనే. బలహీనంగా ఉండే పిల్లలు, ఎదిగే వయసు వచ్చిన ఆడపిల్లలకు ఏమేమి వొండి తినిపించాలో పెద్దల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు ఈ కాలంలో తినిపిస్తారు. శిరోజాల సంరక్షణ, చర్మ సంరక్షణ, పంటి వరుస సరి చేయించడం, జీర్ణశక్తిని ఉద్దీపన చేయడం, బంధువుల రాక వల్ల లేదా బంధువుల ఇంటికి వెళ్లడం వల్ల పిల్లలందరికీ కలిపి వారికి వృద్ధి కలిగించే ఆహారం చేసి పెట్టవచ్చు. తోటి పిల్లలు పక్కన ఉంటే ఇష్టం లేకపోయినా పిల్లలు తింటారు.

సెలవులొచ్చేది పిల్లల మానసిక, శారీరక వికాసానికి. కదలకుండా మెదలకుండా ఫోన్ పట్టుకుని కూచుని వారు ఈ సెలవులు గడిపేస్తే నింద తల్లిదండ్రుల మీదే వేయాలి... పిల్లల మీద కాదు.

ఇంటి పనులతోనే రోజంతా గడిచిపోతుంటుంది అభిరుచిని మెరుగుపరుచుకోవాలన్నా సమయమే సరిపోదనిపిస్తుంది. కానీ, కొందరు మాత్రమే ఉన్న కాస్త సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ తమతోపాటు మరికొందరికి ఉపాధి అవకాశాలను అందిస్తుంటారు. ఈ కోవకే చెందుతారు సవిత ఆలంపల్లి. తెలంగాణలోని జహీరాబాద్ వాసి అయిన సవిత కాటన్ ఫ్యాబ్రిక్‌పైన సహజసిద్ధమైన పువ్వులు, ఆకులతో సహజమైన ప్రింట్లను తీసుకువస్తుంది. అదే ఫ్యాబ్రిక్‌ని ఉపయోగిస్తూ మోడ్రన్ డ్రెస్సులను డిజైన్ చేస్తోంది. వర్క్‌షాప్స్ నిర్వహిస్తూ, బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేసి, సెల్ఫ్ మేడ్ బిజినెస్ ఉమన్‌గా తనని తాను నిరూపించుకుంటుంది. ఆసక్తిని ఉపాధిగా మలుచుకునేందుకు చేసిన ప్రయాణంలో తాను వేసిన అడుగుల గురించి ఆనందంగా వివరించింది.

ఆకులో ఆకునై..

ఎకో ఫ్రెండ్లీ డ్రెస్ డిజైనింగ్


సవిత


వర్క్‌షాప్

"డిగ్రీ వరకు చదువుకున్న నేను పెళ్లయ్యాక మావారు రామకృష్ణతో కలిసి అమెరికాకు వెళ్లాను. గృహిణిగానే కొన్నాళ్లు ఉండిపోయాను. న్యూయార్క్ ఎఫ్ఐటిలో ఫ్యాషన్ డిజైనింగ్‌కి సంబంధించిన కోర్స్ చేశాను. పదేళ్ల క్రితం ఇండియా వచ్చి బెంగళూరులో స్థిరపడ్డాం. రోజంతా ఇంటిపనులు, పిల్లల పనులు ఉన్నా నా కోసం కొంత సమయాన్ని కేటాయించుకునేదాన్ని. ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఉపయోగించే ఫ్యాబ్రిక్ తీవ్రమైన కాలుష్యానికి గురి చేస్తుందని తెలుసుకున్నాను. అప్పటినుంచి నా వంతుగా ఏదైనా చేయాలనుకుని ప్రయత్నాలు చేస్తుండేదాన్ని. ఫ్లోర్ క్లీనర్స్, సుగంధ ద్రవ్యాలు వంటివి ఇంట్లో తయారు చేస్తుండేదాన్ని. వాటివల్ల ఇంట్లో వాళ్లు కూడా చాలా మెచ్చుకునేవారు. ఎకో ప్రింటింగ్, సస్టెయినబుల్ ఫ్యాబ్రిక్స్ పైన వర్క్ చేయడం మొదలుపెట్టాను. ప్రకృతి ద్వారా లభించే వస్తువులతో రోజూ ఏదో ఒక ప్రయోగం చేస్తుండేదాన్ని.

ఆకులు – పువ్వులు

పూజలు, ఇతర సంప్రదాయ వేడుకలలో పువ్వులు, ఆకులను కూడా ఉపయోగిస్తుంటాం. సాధారణంగా వాటిని ఉడకబెట్టి, టై అండ్ డై చేస్తుంటారు. నేను వాటిని ఎండబెట్టి, కొన్నింటిని తాజాగా ఉన్నప్పుడే ఫ్యాబ్రిక్ మీద చల్లి, దగ్గరగా చుట్టి, కొన్ని రోజులు అలాగే ఉంచి ప్రయోగాలు చేసేదాన్ని. ప్రయత్నాలు చేయగా చేయగా ఫ్యాబ్రిక్‌పైన రకరకాల డిజైన్స్ అమితంగా నన్ను ఆకట్టుకున్నాయి. మోదుగ, శంఖపుష్ప, పారిజాత.. వంటివే కాదు అరుదుగా పూసే పువ్వులనూ సేకరిస్తాను. వాటిని ఎండబెట్టి నిల్వ ఉంచుతాను. మామిడి, జామ, మందార ఆకులనూ డిజైన్‌కు వాడుతుంటాను. ఏ మాత్రం రసాయనాలు లేని ప్రయోగం ఇది.

ఇంటి నుంచి స్టూడియో వరకు

రసాయనాలతో పండించే పత్తి కాకుండా వర్షాధార పంటద్వారా వచ్చే కాటన్ ఫ్యాబ్రిక్‌ను కలెక్ట్ చేసి, నా ప్రయత్నాలను ఇంకా విరివిగా చేయడం మొదలుపెట్టాను. సస్టెయినబుల్ డ్రెస్సులు అంటే చాలావరకు వదులుగా ఉండే దుస్తులు అనుకుంటారు. కానీ, మంచి ఫిటింగ్, డిజైన్, ప్రింట్లతో ఈ తరం మెచ్చేలా డ్రెస్ డిజైనింగ్ చేయాలనుకున్నాను. కార్పొరేట్ ఉమెన్‌కు నప్పే విధంగా, అలాగే టీనేజ్ కలెక్షన్స్ కూడా ప్రిపేర్ చేస్తుంటాను. ఎకో ఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్, ప్రింటింగ్.. డ్రెస్సులు ధరిస్తే ఒంటికి పాజిటివ్ ఎనర్జీ లభిస్తుంది. ప్రకృతికి దగ్గరగా ఉన్నామన్న అనుభూతి సొంతం అవుతుంది. ఏడెనిమిదేళ్లుగా సస్టెయినబిలిటీ మీద రకరకాల ప్రయోగాలు చేసి, ఐదేళ్ల క్రితం 'టింక్టోరియా' పేరుతో బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేశాను. ఆకులలో ఉండే జీవాన్ని టింక్టోరియా అంటారు. దానిని ఫ్యాబ్రిక్ మీదకు తీసుకురావాలని చేసిన ప్రయత్నం కాబట్టి అదే పేరును నా డిజైన్స్‌కు పెట్టాను. ఇంటినుంచి స్టూడియోదాకా మారేందుకు చేసిన రకరకాల ప్రయోగాల వల్ల ఇప్పుడు నాతో పాటు మరో ఐదుగురు మహిళలకు ఉపాధి అవకాశాలు లభించాయి. మేమంతా కలిసి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌కు వచ్చిన ఆర్డర్స్ ప్రకారం పని చేస్తుంటాం.







అవగాహనకు వర్క్‌షాప్స్

ఎకోప్రింటింగ్ పట్ల ప్రజలలో అవగాహన కల్పించడానికి హైదరాబాద్, బెంగళూరు ఇతర క్రాఫ్ట్ ఎగ్జిబిషన్స్‌లలో ఉచితంగా వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నాను. స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటాను. అక్కడి వచ్చి, ఆసక్తితో నేర్చుకుంటాను అనేవారు మళ్ళీ మళ్ళీ ఫోన్ చేసి ప్రింటింగ్ ప్రాసెస్ అడుగుతుంటారు. చాలా మందికి ఆకులతోనూ, పువ్వులతోనూ డిజైన్ చేస్తారని తెలియదు. ఈ డిజైన్ ఉతికితే పోతుందేమో అనుకుంటారు. కానీ, సరైన విధంగా చేస్తే రంగు ఏ మాత్రం పోదు. ముందు కుంకుడుకాయ రసంతో ఫ్యాబ్రిక్‌ను శుభ్రం చేస్తాం. ఆ తర్వాత ఆకులను, పువ్వులను అనుకున్న డిజైన్స్‌లో అమర్చి, దగ్గరగా చుట్టి, ఆవిరిమీద ఉంచుతాం. ఆ తర్వాత బయటకు తీసి, ఒక రోజంతా అలాగే ఉంచుతాం. ఆ తర్వాత పూర్తిగా విప్పి, క్లాత్‌ని శుభ్రం చేస్తాం. సరైన డిజైన్ రావడానికి 3 నుంచి 4 రోజుల సమయం పడుతుంది. షిబోరి, టై అండ్ డై, కలంకారీ డిజైన్స్‌తోపాటు నేతకారులతో ముందే మాట్లాడి ఫ్యాబ్రిక్ డిజైన్‌లో మోటిఫ్ ప్రింట్స్ వచ్చేలా గైడెన్స్ ఇస్తుంటాను. కొన్ని రకాల ఆకులు, పువ్వుల ప్రింటింగ్‌లో థ్రెడ్ వర్క్ కూడా ఉంటుంది. ప్రకృతిపైన ప్రేమ, ఇష్టంతో నన్ను నేను కొత్తగా మార్చుకునే క్రమంలో ఎంచుకున్న మార్గం ఇది. ఇంట్లో వాడాల్సిన కెమికల్స్ స్థానంలో ఏ మాత్రం రసాయనాలు లేని వస్తువులను తయారు చేయడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటాను. ఈ విధానం వల్ల ఐదారేళ్లలో నాదైన ఓ కొత్త ప్రపంచాన్ని నిర్మించుకున్నాను అనిపిస్తుంది' అని ఆనందంగా వివరిస్తారు సవిత.


మోడల్

– నిర్మలారెడ్డి

గెలుపు దారి

పాకశాస్త్ర ప్రవీణ

చండీగఢ్‌కు చెందిన 23 సంవత్సరాల దేవిక మన్‌చందానీ ఇప్పుడు న్యూయార్క్‌లోని ప్రముఖ చెఫ్‌లలో ఒకరు. వంటలకు సంబంధించిన ఎన్నో పోటీల్లో బహుమతులు గెలుచుకుంది. పేస్ట్రీ చెఫ్‌గా రకరకాల ప్రయోగాలు చేస్తూ తనదైన ప్రత్యేకత చాటుకుంటోంది.

చిన్నప్పటి నుంచి దేవికకు వంటలన్నా, కొత్త వంటకాల గురించి తెలుసుకోవడం అన్నా చాలా ఇష్టం. ఆ ఇష్టమే తనని చండీగఢ్ వీధుల నుంచి న్యూయార్క్‌లోని ప్రసిద్ధ రెస్టారెంట్‌ల వరకు తీసుకెళ్లింది. ఆమె కుటుంబంలో, బంధువులలో పాకశాస్త్ర ప్రవీణులు ఎంతో మంది ఉన్నారు. వారి దగ్గరి నుంచి ఎన్నో కుటుంబ వంటకాలను నేర్చుకుంది.


వంటలపై దేవిక ఇష్టం ఎక్కడిదాకా వెళ్లిందంటే న్యూయార్క్‌లోని కలినరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అమెరికా(సిఐఎ)లో చదివే వరకు. పాకశాస్త్ర పరిధిని విస్తరించుకోవడానికి, ప్రావీణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఈ చదువు దేవికకు ఉపయోగపడింది.

'సిఐఎ'లో అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ నుంచి నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఇచ్చే అవార్డ్ వరకు ఎన్నో అవార్డులు అందుకుంది దేవిక.

'స్కిల్స్ యూఎస్‌ఏ బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్' పోటీల్లో పాల్గొనడం దేవిక కేరీర్‌లో మైలురాయిగా నిలిచింది. ఆ పోటీలో పాల్గొన్న ఏకైక భారతీయురాలిగా గుర్తింపు పొందింది. అంతేకాదు, ఆ పోటీలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయం తనని రెండు అడుగులు ముందుకు వేసేలా చేసింది. ప్రసిద్ధ 'గాబ్రియెల్' రెస్టారెంట్‌కు సంబంధించి ముఖ్యమైన ఈవెంట్స్‌కు నాయకత్వం వహించేలా చేసింది.

ఆ రెస్టారెంట్‌లో ఎప్పటికప్పుడూ కొత్త కొత్త సవాళ్లు ఎదురయ్యేవి. క్రైసిస్ మేనేజ్‌మెంట్ గురించి బాగా తెలిసిన దేవిక ఆ సవాళ్లను అధిగమించింది.

ఒక విజేతగా సిఐఏ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగం చేసే


దేవిక మన్‌చందానీ

అవకాశం దేవికకు వచ్చింది. 'పాత్ వేస్ టు ఎక్స్‌లెన్స్' అంశంపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేసింది. 'ఎగ్జయిట్‌మెంట్‌కు ఎనర్జీ తోడైతే ఎంత విజయాన్ని అయినా సాధించవచ్చు' అంటుంది దేవిక.

'స్కిల్స్ యూఎస్‌ఏ' రాష్ట్ర స్థాయి పోటీలకు న్యాయనిర్ణేత పాత్ర పోషించిన దేవిక 'బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్'కు సంబంధించిన పోటీకి పోటీ పడుతున్న తరువాతి తరం విద్యార్థులకు మార్గనిర్దేశం చేసింది.

సూపర్ స్పీకర్

దేవిక మన్‌చందానీ చెఫ్ మాత్రమే కాదు స్ఫూర్తిదాయక వక్త కూడా. ఆమె వంటలతో పాటు ఉపన్యాసాలకు కూడా ఎంతోమంది అభిమానులు ఉన్నారు. పనిచేస్తున్న క్రమంలోనే క్రైసిస్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన సూత్రాలు పట్టుబడతాయని చెబుతుంది దేవిక. చదువుల కోసం వేరే దేశం వెళ్లే విద్యార్థులకు రకరకాల సవాళ్లు ఎదురవుతుంటాయి. తాను అమెరికాకు వచ్చినప్పుడు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి. వాటిని అధిగమించిన తీరును విద్యార్థులకు చెబుతుంటుంది దేవిక. 'ఎంతో కొంత నేర్చుకున్నాను అనే తృప్తి కంటే 'ఇంకా ఎంతైనా నేర్చుకుంటాను' అనే దాహం విజయానికి దారి చూపుతుంది అంటుంది దేవిక.

'లక్ష్యం మీద అయోమయం కాదు స్పష్టత ఉండాలి' అంటున్న దేవిక ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తుంది.



పేస్ట్రీ చెఫ్ కావాలనే కలతో చండీగఢ్ నుంచి అమెరికాకు వెళ్లిన దేవిక తన కలను నెరవేర్చుకోవడమే కాదు చిన్న వయసులోనే ప్రముఖ 'పేస్ట్రీ చెఫ్'గా పెద్ద పేరు తెచ్చుకుంది.

స్త్రీ శక్తి

సముద్రంపై సాహస సంతకం



'భయంతో కాదు ప్రేమతో మాత్రమే సముద్రంలో ప్రయాణం చేయగలం' అనే మాట ఉంది. వందమందిలో ఒకరిగా సముద్రప్రయాణం వేరు. ఒకరిద్దరుగా వేరు. దిల్నా కె, రూప ఎ ఇరవై రెండు రోజుల పాటు సముద్ర ప్రయాణం చేశారు. కొన్నిసార్లు సముద్రం తన మౌన గాంభీర్యాన్ని వీడి కోపంతో గర్జించేది. ప్రశాంతం అనుకున్న సాగరంలో కల్లోలం మొదలయ్యేది. అయితే ఎలాంటి ప్రతికూల పరిస్థితులకూ ఈ ఇద్దరూ భయపడలేదు.

భారతీయ నావికాదళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా కె, లెఫ్టినెంట్ కమాండర్ రూప ఎ 'ఐఎన్‌ఎస్వీ' తరిణితో సముద్ర సాహస యాత్రని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా ప్రత్యేకత చాటుకున్నారు. 'తరిణి' నౌకలో గోవా నుంచి బయలుదేరి 22 రోజుల తరువాత మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు చేరుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని విజయవంతంగా సముద్రయాత్ర చేసిన దిల్నా, రూపలు శభాష్ అనిపించుకున్నారు.

ఫిబ్రవరి 28న గోవాలోని ఐఎన్‌ఎస్వీ మండోవి నుంచి మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు బయలుదేరింది తరిణి. గమ్య స్థానానికి చేరుకున్న తరువాత రెండు దేశాల (భారత్, మారిషస్)ల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడానికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు, విన్యాసాల్లో మారిషస్ కోస్టు గార్డ్‌లతో కలిసి పాల్గొన్నారు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూప.

'ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా నిలిచారు. వీరి విజయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుంది' అని దిల్నా, రూపలను ప్రశంసించింది నావికాదళం. సముద్ర ప్రయాణ కాలంలో భారీ గాలులు, ప్రతికూల సముద్ర పరిస్థితుల రూపంలో దిల్నా, రూపలకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. అయితే ఎప్పుడూ ధైర్యం కోల్పోలేదు.

'ఒక్కసారి అధైర్యపడితే ఓటమికి ఆహ్వానం పంపినట్లే.

రెండోసారి అధైర్య పడితే ఓటమి మీ గుమ్మం వరకు వచ్చినట్లే.

మరోసారి కూడా భయపడితే ఓటమి ఇంట్లోకి వచ్చినట్లే' అని శిక్షణ సమయంలో విన్న మాటను వారు బాగా గుర్తుపెట్టుకున్నారు.

సముద్రమంత సాహసం


దిల్నా


రూప

నాలుగు ప్రయత్నాల తరువాత అయిదోసారి నేవీకి ఎంపికైంది కేరళలోని కోజికోడ్‌కు చెందిన దిల్నా కె. నావికాదళంలోకి ప్రవేశించడానికి ముందు ఆర్చరీ, క్రికెట్‌లో ప్రతిభ చాటుకుంది. నేవీ షూటింగ్ టీమ్‌లో ఒకరైన దిల్నాకు రొటీన్ యాత్రల కంటే సాహస యాత్రలు అంటే ఇష్టం. పుదుచ్చేరికి చెందిన రూప అలగిరిసామికి స్ఫూర్తి... కల్పనాచావ్లా. చెన్నైలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేసింది. సాహసాలకు మారుపేరుగా నిలిచిన మహిళల జీవితచరిత్రలు చదవడం అంటే ఇష్టం. ఈ ఇద్దరికి ప్రముఖ నావికుడు, గోల్డెన్ గ్లోబ్ రేస్ హీరో అభిలాష్ టోమి (రిటైర్డ్) శిక్షణ ఇచ్చారు. ఐఎన్‌ఎస్వీ నౌకలో ప్రపంచాన్ని చుట్టివచ్చిన భారతీయుడిగా టోమి రికార్డ్ సృష్టించాడు. గత సంవత్సరం దిల్నా కె, రూపలు ఆరుగురు సభ్యుల బృందంతో కలిసి గోవా నుంచి కేప్‌టౌన్ మీదుగా రియో డి జనీరోకు 188 రోజుల పాటు నౌకాయానం చేశారు.

ఈ నెల 21న గోవాలోని మండోవికి తిరిగి వచ్చిన ఐఎన్‌ఎస్వీ తరిణికి నావికా సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈ సముద్ర యాత్రకు దిల్నా, రూపలను తేలిగ్గా ఎంపిక చేయలేదు. కఠినమైన ఎంపిక ప్రక్రియతో అనేక వడపోతల ద్వారా వీరిని ఎంపిక చేశారు.

వీరి సాహసం ఇక్కడితో ఆగిపోదు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్న 'సాగర్ పరిక్రమ' అనే భూగోళ ప్రదక్షిణ కోసం ఈ ఇద్దరూ సన్నద్ధమవుతున్నారు.

'సాహసం' లోని విశేషం ఏమిటంటే... దానిపక్కన ఫుల్‌స్టాప్ ఎప్పుడూ ఉండదు. ఒక సాహసం మరో సాహసాన్ని ప్రేరేపిస్తుంది. విజయం సాధించేలా చేస్తుంది. 'సాగర్ పరిక్రమ'లో కూడా దిల్నా, రూపలు విజయం సాధించాలని ఆశిద్దాం.